# శ్రీమన్నారాయణుని పంచాయుధ వైభవం

**శ్రీ అద్దంకి శ్రీనివాస్**, విశాఖపట్నం.

శ్రీమన్నారాయణుడు లోక రక్షకుడు. దీనులలో వ్యాపించిన భయాందోళనల్ని నాశనం చేసి మానసికమైన ధైర్యాన్ని, శాంతిని కలుగజేసే దయా స్వరూపుడు. దనుజుల్ని సంహరించి మునిజనులను, దేవతలను, సజ్జనులను పాలించే పంచాయుధధారి.

భీతిల్లిన మనసులకు స్వామి పంచా యుధాల్ని ధరించి అభయప్రదాతగా దర్శన మిస్తాడు. అందుకే విష్ణుస్తోత్రాలలో కూడా ఆయుధరూపధారియైన మూర్తికే ప్రాధాన్యం ఎక్కువ .

సశంఖ చక్రం సకిరీట కుండలం
సపీత వస్త్రం సరసీరుహేక్షణం
సహార వక్ష స్థల శోభి కౌస్తుభం
నమామి విష్ణుం శిరసా చతుర్భుజం.

అని మొట్టమొదట శంక చక్రాల్ని ధరించినవాడుగా ప్రస్తుతింపబడ్డాడు.

నారాయణుడు దీనులను, ఆర్తులను రక్షించి దనుజపీడను నాశనం చేయడానికెన్నో, దివ్యావతరాల్ని ధరించి, సందర్భానుసారంగా అభయ ప్రదాత రూపాలను ధరించి, ఆర్తావనా విధిని నిర్వహించాడు. సర్వకాల సర్వావస్థల లోనూ అందరి ఆర్తులనూ, భయాలనూ పోగొట్టి ధైర్యాన్నిచ్చేవాడు, శక్తిని కలిగించేవాడూ శ్రీమన్నారాయణుడే.

వనే రణే శత్రుజలాగ్ని మధ్యే
యదృచ్ఛయా పత్సు మహా భయేషు.

అన్నట్లుగా వనంలోనూ, యుద్ధం లోనూ, జలాశయాలలోనూ అగ్ని మధ్యం లోనూ ఇలా అనేక విధాలుగా యాదృచ్ఛికంగా సంభవించే ఆపదావస్థల్నించీ, మహా భయాల్నించీ కాపాడే సర్వపాలకుడు ఆ శ్రీహరి. దానికి ఆయన ధరించే రూపంగానీ, విధానంగానీ భిన్నంగా ఉంటుంది. ఏది ఏమైనా దీనజన సంరక్షణే స్వామికి ధ్యేయం.

'జలే రక్షతు వరాహః
స్థలే రక్షతు వామనః
అటవ్యాం నారసింహశ్చ
సర్వతః పాతు కేశవః'

ఈ శ్లోకం నారాయణుని సర్వ సమర్థమైన రక్షణ శీలాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

జలగామములైన వారికి గానీ లేదా ఆకస్మికంగా వరదలు ఉప్పెనల వల్ల సంభవించే ఉపద్రవాలనుండి గానీ, లేక జల జంతువుల నుండిగానీ రక్షించేవాడు వరాహరూప ధారి యైన ఆదివరాహవిష్ణువు. వరాహరూప ధారియై జలధిలో మునిగిన భూగోళాన్ని ఏ విధంగా అయితే సముద్ధరించి రక్షించాడో ఆ వరాహ స్వామి జలసంబంధితమైన ఆపదావస్థల్నుండి ఒడ్డుకు చేర్చగలిగే దయా సముద్రుడు.

భూభాగాన్ని మొత్తం తన మూడడుగు లతో ఆక్రమించి, మూడు వైపులా విశేషంగా వ్యాపించి స్థలాన్ని మొత్తాన్ని తన అధీనంలోకి తెచ్చుకొని వామనావతారమూర్తియై శ్రీ మహా విష్ణువు స్థలభాగంపై సంభవించే విపత్తులకు విమోచనాన్ని కలుగజేసే త్రివిక్రమ స్వరూపునిగా రక్షణా భారాన్ని వహిస్తూ భయార్తులకు అభయ హస్తాన్నిస్తున్నాడు.

ఘోరారణ్య నివాసిత క్రూర జంతువుల నుండి సంభవించే సంక్షోభాలని సంహరించే స్వరూపుడు ఉగ్రనరసింహరూప ధారి అయిన శ్రీమహావిష్ణువు. ప్రహ్లాదుని వాత్సల్యంతో రక్షించిన కరుణాంతరంగుడు. జల స్థల అటవ్యాదులు గాక మిగిలిన సర్వ ప్రదేశాలలోనూ వెన్నంటి రక్షించేవాడు కేశవుడే. ఈ శ్లోకం విష్ణువులోని దీన రక్షణను చక్కగా వివరిస్తోంది.

శ్రీహరి సర్వజీవులను శిక్షించాలన్నా, రక్షించాలన్నా కేవలం మనో సంకల్పం చేతనే గావించగల మహిమాన్వితుడు. కానీ భక్తులకు అభయత్వాన్ని ప్రసాదించడానికి, చూడగానే సర్వ భయాలు దూరంగా తొలగిపోవడానికీ మహా మహిమోపేతాలైన పంచాయుధాలను ధరించి భక్తుల హృదయాలకు స్వస్థతను చేకూరుస్తాడు. స్వామి ధరించిన పంచా యుధాలు మహిమాన్వితమైనవి. శత్రుభయం కరమైనవి. సముజ్వలమైనవి. భగవంతుని భక్తుల ఎడ అవ్యాజమైన అనురాగం కలిగి ఉన్నవి. విష్ణుమూర్తి ఆజ్ఞలను శిరసావహించే భక్తి ప్రపన్నత కలిగినవి. అందుకే భాగవ తోత్తములు, వైష్ణవతత్త్వజ్ఞులు అయిన మహానుభావులు పంచాయుధ స్తోత్రాల్ని రచించారు. పంచాయుధాల్ని ప్రస్తుతించి, స్వామివారి కృపకు పాత్రులై సర్వపీడలనుండీ విముక్తి పొందాలని, పంచాయుధ వైభవాన్ని వేనోళ్ళ కీర్తించారు.

## స్వామి ధరించే పంచాయుధాలు

1. చక్రం - దీనికే సుదర్శనం అని పేరు.

2. శంఖం - దీనికే పాంచజన్యం అని పేరు.

3. గద - దీనికే కామోదకీ అని పేరు.

4. ఖడ్గం - దీనికే నందకం అని పేరు.

5. ధనువు - దీనికే శార్‌జ్గం అని పేరు.

## చక్రం

విష్ణు హస్త ప్రచలితమైనదీ విరాజమానమైనదీ చక్రం. శ్రీమహావిష్ణువు పంచాయుధాలలో ప్రథమమైనది. సర్వాయుధాలకూ అధిదేవతగా స్వామివారి కుడిచేతియందు నివసించే భాగ్యం కలది. దీనికి సుదర్శనం అని పేరు.

రాక్షసుల శరీరాల్ని ఛేదించునదీ, అగ్ని, సూర్య చంద్రాది దేవాత్మకమైన ప్రకాశకత్వం కలిగినదీ, చీకటిని సంహరింపచేసి వెలుగును ప్రసాదింపజేయునదీ సమస్త శస్త్ర పరివృతమైనదీ, దేవతలను తన అధీనంలో ఉంచుకొనునదీ అయిన సుదర్శనం వైష్ణవ సంప్రదాయం మాత్రమేకాక శ్రుతులలోనూ, స్మృతులలోనూ, ఇతిహాసాలలోనూ ప్రస్తుతుల్ని పొందింది.

ద్వాదశాదిత్యులను సమూహంగావిస్తే సుదర్శన తేజస్సుతో సమానమౌతుందనీ, దేవతలను కాపాడుట రాక్షసుల్ని సంహరించడం వంటి కృత్యాల్ని ఆచరించిన సుదర్శనం శ్రీమన్నారాయణునితో సమ స్కంథంగా అర్చించబడుతుందని ప్రస్తుతుల్ని పొందింది.

శ్రీమహావిష్ణువు కార్య సంకల్పానికి ఆచరణ రూపమైనది సుదర్శనం. గజేంద్రుని రక్తాన్ని పీల్చి బాధించిన నక్రాన్ని, భగవత్ తత్త్వాన్ని అవలోకింపక శ్రీకృష్ణుని తూలనాడిన శిశుపాలుని వధించి స్వామివారి కీర్తిని ఇనుమడింపజేసింది.

అంబరీషునిపై అకారణ ఆగ్రహాన్ని ప్రదర్శించిన దూర్వాసమహాముని దురాభిక్యాన్ని మట్టుపెట్టడానికి అతనిని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగించింది. భగవంతుని నిత్యం ఆరాధించే అమాయకులు సచ్చరిత్రులైన భాగవతోత్తముల్ని ఎవరైనా బాధిస్తే వారి ఎంతవారైనా సరే సుదర్శనం సహించలేదు. అందుకే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు చెప్పి వారించలేక పోయినంత ఘనత వహించింది. చివరకు అంబరీషుడే భక్తితో శాంతించమని వేడుకొనగా శాంతించి తన వినమ్రతను ప్రదర్శించింది.

దేవదానవులు క్షీరసాగరాన్ని మథించగా వచ్చిన అమృతాన్ని మోహినీ రూపంలో శ్రీమహావిష్ణువే తొలుత దేవతలకు పోస్తూండగా, రాహుకేతువులు కన్నుగప్పి దేవతల వరుసలో కూర్చొని అమృతాన్ని సేవించారు. అపుడు శ్రీహరి సుదర్శనాన్ని పంపి వారి కంఠాల్ని త్రుంచాడు. ఈ విధంగా ఎన్నో సందర్భాలలో సుదర్శనం తన విధి నిర్వహణలో స్వామిభక్తి పరాయణత్వాన్ని ప్రదర్శించింది. కావున అటువంటి సుదర్శనాన్ని ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవ రాయులు--

అడరు గజా సహస్రధారలు
మహోముఖవాంతసుధాంబు ధారలున్
బొడవగు వహ్ని కీలములు
పొంగునుగా బెటిదైత్య కోటికిన్
బెడిదపు గిన్కతో నెసరు వెట్టిన
పెద్ద పనంటి వోలెనె
క్కుడు వెస రాహుమస్తకము
గొన్న సుదర్శనదేవు గొల్చెదన్.

అని కీర్తించాడు. శ్రీ పంచాయుధ స్తోత్రం సుదర్శన చక్ర స్వరూపాన్ని ఈ విధంగా తెలియజేస్తోంది.

స్ఫురత్సహస్రార శిఖాతి తీవ్రం
సుదర్శనం భాస్కర కోటి తుల్యం
సురద్విషా ప్రాణ వినాశ విష్ణోః
చక్రం సన్నాహం శరణం ప్రపద్యే.

వేవేల అగ్నిజ్వాలలో తీవ్రంగా జ్వలిస్తూ ప్రకాశిస్తూ ఉన్న కోటి కాంతుల సమాహారమై విరాజమానమై ఉన్న, దేవతలకు శత్రువులైన దైత్యుల ప్రాణాల్ని హరింపజేసే సమర్థతగల, విష్ణువుకు ప్రధానయుధమైన సుదర్శనం చక్రం సదా నన్ను రక్షించుగాక!

## శంఖం

శ్రీమన్నారాయణుని చేతి శంఖానికే పాంచజన్యమని పేరు. పంచజనుడనే రాక్షసునికి గుర్తుగా శ్రీహరి ధరించడంవల్ల దానికా పేరు వచ్చింది.

'పాంచ జన్యధ్వాన ధ్వాస్త పాతక సంచయుమ్' అని వ్యవహరించడంవల్ల పాంచజన్యం నుండి ఉద్భవించిన ధ్వని వీనులకు సోకినట్లయితే సర్వపాపాలు హరిస్తాయని తెలుస్తోంది. ఈ పాంచజన్యం ధార్తరాష్ట్రుల హృదయాల్ని చీల్చి వేసిందట.

'సజోషధార్త రాష్ట్రాణాం
హృదయాని వ్యదారయత్'.

శ్రీమన్నారాయణుడు సర్వగంధ, సర్వరస స్వరూపునిగా ప్రసిద్ధి గాంచాడు. ఈ రస, గంధ శబ్దాలు రెండూ వేదాలలో పరమాత్మకు విశేష్య వాచకాలై ఉన్నాయి. శ్రీహరి గంధ స్వరూపుడు కావడంవల్ల అతని ముఖం నుండి వెలువడే వాయువు కూడా సుగంధభరితమైనది.

హరి పాంచజన్యాన్ని పూరించినపుడు అతని ముఖంనుండి వెలువడిన వాయువు సుగంధభరితమైనదికావడంవల్ల, నాభీ కమలంలోని తుమ్మెదలు పైకి ఎగురుతూ ఉండగా, రాక్షసుల ప్రాణములను చీల్చునట్లున్న తెల్లని పాంచజన్యం మిక్కిలి మంగళదాయకమైనదని శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో ఈ విధంగా

ప్రస్తుతించాడు.

''హరి పూరింప దదాస్య మారుత
సుగంధాకృష్టమై నాభిపం
కరుహ క్రోడమిళింద బృంద
మెదుం జెక్కొందుఃష్కియాపంకసం
కరదైత్యాసు పరంపరంగముచు
రేఖం బొల్చు రాకాశిశా
కరగౌరద్యుతి పాంచజన్య
మెుసగుం గల్యాణ సాకల్యమున్''

పాంచజన్యం శ్వేతవర్ణాన్ని కలిగి ఉండటంవల్ల ఇది సాత్త్వికమైన అహంకారానికి సంకేతమని తాత్త్వికులు నిర్వచించారు. విశిష్టాద్వైతంలో పరమభాగవతోత్తములుగా భావించబడిన ద్వాదశాళ్వారులలో ఆద్యులైన 'పొయ్‌గయ్ యాళ్వార్' ఈ పాంచజన్యం యొుక్క అంశతోనే జన్మించారని విష్ణు తత్త్వజ్ఞుల అభిమతం.

శ్రీపంచాయుధ స్తోత్రం సకల శుభప్రదమైన పాంచజన్యాన్ని ఈ విధంగా ప్రస్తుతిస్తోంది.

''విష్ణోర్ముఖోత్థానిల పూరితస్య
యస్య ధ్వని ర్దానవ దర్పహంతా
తం పాంచజన్యం శతకోటి శుభ్రం
శంఖం సదా హం శరణం ప్రపద్యే.''

శ్రీమహావిష్ణువు దివ్యాస్త్రం నుండి వెలువడిన వాయువుచేత పూరింపబడిన ఆ శంఖధ్వని నిశాచరుల దర్పాన్ని మర్దిస్తుంది. అంతేకాదు కోటి చంద్రులకాంతిలో సమాన మైన ధవళకాంతులలో ప్రకాశించే శంఖం సదా నన్ను రక్షించడానికి శరణు వేడుతున్నాను.

## గద

శ్రీమన్నారాయణుని గదాయుధానికి 'కౌమోదకి' అని పేరు. కౌమోదకి బుద్ధికి చిహ్నమైనది. విష్ణువును ఆశ్రయించిన వారి విరోధులను సంహరించే స్వభావం కలది. భగవంతుని హస్తస్థితమై రక్షణావిధి నిర్వహణలో ప్రముఖమైన పాత్ర వహిస్తుంది.

పూర్వం సాళ్వనామధేయుడైన ఒక రాక్షసుడు కామగమనంకల తన పట్టణంతో సహా మధురానగరంపై విరుచుకుపడి అందరినీ హింసించుచుండగా శ్రీకృష్ణపరమాత్మ 'కౌమోదకి' అనే ఈ గదను శిష్ట జన రక్షణార్థం ప్రయోగించాడు. అపుడు ఆ నగరం కౌమోదకి యందు తొడిగిన కంకణాలలో ఒకటిగా మమైక్యం చెందింది. ఈ విషయాన్ని శ్రీకృష్ణదేవరాయలు ఈ విధంగా అభివర్ణిస్తూ అటువంటి కౌమోదకిని గొల్చెదనని భక్తిప్రపత్తుడై విరచించాడు.

'యాదవ సార్వ భౌమ భయదాయత
బాహునియుక్తి జేసి యెం
దే దనుజేంద్ర సాళ్వ పురలేమ
మణీ వరణంబు సంగతం
బై దివినాత్మ కంకమము లందొక
కంకణ మయ్యె నట్టి కౌ
మోదక మోదకీ సిత సముజ్జ్వల
కల్పక మాల్య గొల్చెదన్'.

ఆళ్వారులలో సుప్రసిద్ధులైన పూదత్తాళ్వార్ ఈ కౌమోదకీ అంశతోనే జన్మించారు.

శ్రీపంచాయుధ స్తోత్రం కౌమోదకీ స్వరూపాన్ని ఈవిధంగా అభివర్ణిస్తోంది.

'హిరణ్మయీ మేరు సమానసారం
కౌమోదకీం దైత్యకులైక హంత్రీం
వైకుంఠ వామాగ్ర కరాభిమృష్టాం
గదాం సదా హం శరణం ప్రపద్యే'.

'కాంచయుతమై, మేరు పర్వతంతో సమానమైన తేజోవంతమై, రాక్షస మస్తక భేదకమై, వైకుంఠుని వామహస్త భూషితమై అలరారు కౌమోదకీ అనే గదను శరణు వేడెదను'.

## ఖడ్గం

దీనికి నందకమని వ్యవహారం. 'నందయతీతి నందకః' అంటే విష్ణు పదార వింద నిత్యాశ్రితులను సంరక్షించడంకోసం శత్రు సంహారం గావించి ఆనందాన్ని కలుగ చేస్తుంది. కాబట్టే దీనికి నందకమని సార్థక నామధేయం.

ఇది జ్ఞాన స్వరూపాత్మకమై విజ్ఞానానికి చిహ్నంగా అలరారుతోంది. దీని 'ఒర' అజ్ఞానానికి గుర్తు. ఖడ్గం ఎంత ప్రకాశ వంతమైనదైనప్పటికీ, అది 'ఒర'లో నిక్షిప్తమై ఉండునంత కాలమూ దాని ప్రోజ్వల్యం వ్యక్తం కాదు. అలాగే స్వతః జ్ఞానం కలిగి ఉన్నప్పటికీ జీవుడు అజ్ఞానం అనే ఒరలో చిక్కుకొని ఉండడంవల్ల జ్ఞానమనే ఖడ్గ జ్యోతి (కాంతి) ప్రకాశించదు. 'ఒర' నుండి బైటకు తీసిన ఖడ్గం వలే అజ్ఞానం తొలగిపోగా జీవుడు జ్ఞానంతో ప్రకాశించును. అందుకే నందకం జ్ఞానానికి చిహ్నమైనది.

విజ్ఞాన దీపాంకురమై దేదీప్యమానంగా ప్రకాశిస్తూ పాపాలనెడి లతావల్లరులను ఛేదించే నందకమనే ఖడ్గాన్ని శ్రీకృష్ణదేవరాయలు ఈ విధంగా అభివర్ణించాడు.

'ప్రతతోర్ధ్వాధర భాగ పీఠయుగళీ
భాస్వత్సరుస్తంభసం
స్థితి దీఢించెందు జాకువా మొసలివా
దీప్తార్చిగాగజ్జలా
న్విత ధూమాసిత రేఖపై యలుగుగా
విజ్ఞాన దీపాంకురా
కృతి నందంబగు నందకంబఘలతా
శ్రేణిచ్ఛిదంజేయుతన్'

ఆళ్వారులలో తృతీయునిగా ప్రసిద్ధి వహించిన పేయాళ్వారులు ఈ నందకాంశతో నవతరించారని ప్రతీతి.

శ్రీ పంచాయుధ స్తోత్రం నందకాన్ని ఈ విధంగా అభివర్ణిస్తోంది.

'రక్షో సురాణాం కఠినోగ్ర కంఠ
చ్ఛేదక్షర చ్ఛోణిత దిగ్ధ ధారామ్

తం నందకం నామ హరేః ప్రదీప్తం
ఖడ్గం సదా హం శరణం ప్రపద్యే'

'రాక్షసుల యొక్క కఠినమైన కంఠా లను ఛేదించి శోణితాలంకృతమై ప్రదీప్త మైన నందకమనే ఖడ్గాన్ని శరణు వేడు తున్నాను.'

## ధనుస్సు

శ్రీమన్నారాయణుని హస్తభూషణమై ఉన్న ధనువుకే శార్ఙ్గమని వ్యవహారం. ఇది ఇంద్రియం మొదలయిన తామసమైన అహంకారాలకు చిహ్నభూతమైనది. ఈ ధనువు తామసాహంకారం కాగా, ధనువు నుండి ఉద్భవించు బాణాలే తామసాహంకార యుక్తమయిన పంచకర్మేంద్రియాలు.

దుర్విదగ్ధతలో శత్రువులపైకి తమంతతాముగా వెళ్ళేవారి ధర్మాన్ని హరించి వారిని నశింప జేసేవే ఈ అస్త్రాలు.

పూర్వం శ్రీహరి సుమాలి అనే రాక్షసునిపై ఈ శార్ఙ్గాన్ని సంధించి బాణవృష్టిని కురిపించాడు. ఆ సందర్భంగా -

'పిడికెడు కౌను గొప్ప గని
ప్రేమద్రివక్ర సమాంగి జేసితే
పిడికెడు కౌనుగొప్ప బయి
పెచ్చుగుణంబునుగంటి నంచునే
ర్పడగ నిజ త్రివక్రతయు
చాపగ వ్రెుక్కెడు నాసుమాలిపై
జడిగొననమ్ము లీనుహరి
శార్ఙ మొధనుర్లత గాచుగావుతన్'

అనుచూ నా వక్రతను పోగొట్టుమని వేడుకొనే శార్ఙ్గం నన్ను రక్షిస్తుందని ఆముక్త మాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు వేడు కొన్నాడు.

ఆళ్వారులలో చివరివారైన తిరుమంగ యాళ్వారు ఈ శార్ఙం యొక్క అంశతో జన్మించారని ప్రతీతి.

**శ్రీపంచాయుధ స్తోత్రంలో-**

'యజ్జ్యానినాద శ్రవణా త్సురాణాం
చేతాంసి నిర్ముక్త భయాని సద్యః
భవంతి దైత్యాశని బాణ వర్షైః
శార్ఙ్గం సదా హం శరణం ప్రపద్యే'

తన గుణ నిక్వణం చేత సురల హృ దయాల్లోని భయాన్ని తొలగించి, బాణవర్షం చేత దైత్యులను సంహరించే శార్ఙ్గం ఎల్లప్పుడూ నన్ను రక్షించుగాక' అని శార్ఙ్గ వైభవాన్ని వివరిస్తోంది.

పంచాయుధాలు శ్రీహరికి మరింత శోభను కల్గిస్తాయి. ఎల్లప్పుడూ స్వామివారి సామీప్యంలో హస్తభూషణాలై ధన్యత్వాన్ని పొందాయి. ఎవరికీ లభించని పరమాత్మ సామీ ప్యాన్ని అవి ఎప్పుడూ కోల్పోలేదు. సర్వేశ్వ రుడు రామావతారంగానూ కృష్ణావతారంగా నూ భువిపై ఉద్భవించినపుడు స్వామివారి అభావాన్ని భరించలేక పంచాయుధాలు కూడా భువిపైకి అనేక రూపాలలో బయలుదేరి వచ్చాయి. శంఖ చక్రాలు శ్రీరాముని వెంట భరత, శత్రుఘ్నులుగా వెంట వచ్చాయి. శ్రీ కృష్ణావతారంలో పరమాత్మ స్వయంగా శంఖ చక్రధారియై దర్శనమిస్తాడు. రామాయణం లో రావణుని భార్య మండోదరి శ్రీరాముని శంఖచక్రాది పంచాయుధ ధారియై ఉన్నట్లు దర్శించినదనుటే దీనికి నిదర్శనం. ఎల్లప్పుడూ స్వామి అధీనంలో ఉంటూ స్వామివారి స్థితి పాలనలో ఆజ్ఞను శిరసావహించేవే ఈ పంచా యుధాలు. భగవంతుని చేతిలోని పద్మం సృ ష్టికి, చక్రం స్థితికి, గద రక్షణకు, శంఖం శత్రు సంహారానికి ప్రతీకలుగా చెబుతారు.

ఇట్టి వైభవోపేతమైన పంచాయుధాలను ఎవరైతే అనుదినం భక్తి శ్రద్ధలతో నిష్ఠగా పూజిస్తారో పంచాయుధ స్తోత్రం చేస్తారో వారిలోని సమస్తమైన దుఃఖాలు నశిస్తాయి. భయం వీడిపోతుంది, పాపాలన్నీ తెగిపోతాయి సుఖం వెల్లివిరుస్తుందని పంచాయుధ స్తోత్రం పేర్కొంటోంది.

'ఇమం హరేః పంచాయుధానాం
స్తవం పఠేద్యో నుదినం ప్రభాతే
సమస్త దుఃఖాని భయాని తస్య
పాపాని నశ్యంతి సుఖాని సంతి.

మహాభయాలు సంభవించడానికి కారణాలు అనేకం. వనంలోగానీ, రణంలో గానీ, అగ్నిమధ్యంలోగానీ ఆకస్మికంగా సంభవిస్తాయి.

'వనే రణే శత్రు జలాగ్ని మధ్యే
యదృచ్ఛయా పత్యు మహాభయేషు
ఇనం పఠన్ స్తోత్ర మనాకులాత్మా
సుఖీభవేత్ తత్కృత సర్వరక్షః'

ఈ విధంగా అకస్మాత్తుగా సంభవించే భయాందోళనల నుండి విముక్తిని పొందడానికి పంచాయుధ స్తోత్రమే రక్షణ కవచంలా పనిచేస్తుంది. అనాకులమైన మనసులకు శాంతి చేకూరుతుంది. సర్వ రక్షణా భారాన్ని పంచాయుధాలే వహిస్తాయి.

ఈ పంచాయుధ ధారణతో తన రక్షకత్వ విధుల్ని నిర్వహిస్తున్నాడు శ్రీమహా విష్ణువు.

'సచ్చక్ర గదాఖడ్గ శార్ఙణం
పీతాంబరం కౌస్తుభ వత్సలాంఛితం
శ్రియా సమేతోజ్జ్వల శోభితాంగం
విష్ణుం సదా హం శరణం ప్రపద్యే.

పంచాయుధాల్ని ధరించిన శ్రీమహా విష్ణువును శరణుకోరడం అత్యుత్తమైన భయనాశకమైన మార్గం. సర్వాయుధాల్ని ధరించిన విష్ణువును నిత్యం స్తోత్రం చేయడం ద్వారా సర్వపాపాలనూ, భయాలను పోగొట్టు కొని, సుఖశాంతులతో జీవితాన్ని ఆనంద మయం చేసుకోవడానికి విష్ణు సహస్ర నామ స్తోత్రం పంచాయుధాలతో కూడిన శ్రీమన్నారా యణుని శరణుకోరే తారక శ్లోకాన్ని భక్తులకు అందిస్తోంది. ఈ శ్లోకాన్ని నిత్యం స్మరిస్తూ దుష్టశక్తులనుండి రక్షణపొంది భగవంతుని పాలనలో సుఖంగా సుభిక్షంగా శాంతియుత జీవనాన్ని సాగిద్దాం.

వనమాలీ గదీ శార్ఙ్గీ
శంఖీ చక్రీచ నందకీ
శ్రీమాన్ నారాయణో విష్ణుః
వాసుదేవోభి రక్షతు.